

పెండ్లిమర్రిలో అత్యధిక వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - కడప

పెండ్లిమర్రి మండలంలో అత్యధికంగా 9.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం నుండి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కడపలో 4.2, చెన్నూరులో 6.2, చింతకొమ్మదిన్నె మండలంలో 7.4, ఒంటిమిట్టలో 3.2, సిద్ధవటంలో 4.2, బద్వేలులో 6.6, బి. మటంలో 2.4, పోరుమామిళ్లలో 3.2, బి. కోడూరులో 5.2, గోపవరంలో 3.4, అట్లూరులో 5.4, మైదుకూరులో 5.0, రాజుపాలెంలో 1.2, ప్రొద్దుటూరులో 7.2, చాపాడులో 3.2, దువ్వూరులో 4.6, ఎర్రగుంట్లలో 3.8, పులివెందులలో 2.2, లింగాలలో 2.2, వేములలో 4.0, వేంపల్లి లో 1.6, చక్రాయపేటలో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లావ్యాప్తంగా సగటున 2.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

జిజిహెచ్‌కు సూపరింటెండెంట్ కావలెను!



- 10 రోజులు దాటుతున్నప్పటికీ సెలవులోనే..
- ఎఫ్ఎసి సైతం ఇవ్వకుండా వెళ్లిన వైనం
- ఫిర్యాదులు..వివాదాలతో కొరవడిన పర్యవేక్షణ
- పోలీసు పంచాయితీ వరకు వెళ్లిన ఉద్యోగులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా సర్వజన ప్రభుత్వాస్పత్రికి సమర్ధ సూపరింటెండెంట్ అనివార్యమనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుత జిజిహెచ్ సూపరింటెండెంట్ ఆమె కుమారుడు అమెరికా నుంచి వస్తున్న నేపథ్యంలో 10 రోజుల కింద సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. 10 రోజులు దాటితే జిజిహెచ్ బాధ్యత నిర్వహణను డిప్యూటీ సూపరింటెండెంట్, ఇతర ఉన్నతాధికారులకు ఫుల్ అడిషనల్ ఛార్జి (ఎఫ్ఎసి) అప్పగించి వెళ్లాల్సి ఉంది. ఈమేరకు సీనియర్ అసిస్టెంట్ కలెక్టర్‌కు ఫైలు నడిపి కలెక్టర్ దృష్టిలో సెలవు పెట్టిన విషయాన్ని ఉంచాల్సి ఉంది. ఇటువంటి ప్రయత్నం చేయని నేపథ్యంలోనే జిజిహెచ్ కార్యాలయ ఉద్యోగుల మధ్య విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి చేరుకున్నాయి. వివాదాలు..ఫిర్యాదులు..దాడులు..ఎన్‌జిఒ సంఘాల నాయకులు, పోలీస్‌స్టేషన్ వరకు విభేదాల వ్యవహారం చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని నెలల తరబడి ఉద్యోగుల మధ్య విభేదాలు కొన సాగుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా జిజిహెచ్ పర్యవేక్షణ కొరవ డింది. నిత్యం వందలాది మంది రోగులతో కిటకిటలాడుతున్న జిజిహెచ్ పనితీరును గాలికి వదిలేయడమేమిటనే చర్చ నడుస్తోంది. కొన్ని నెలల కిందట డిప్యూటీ డైరెక్టర్ (డిడి)పై కార్యాలయ ఉద్యోగులు పోలీసులకు రెండు దఫాలుగా ఫిర్యాదులు చేయడం, విచారణలు చేపట్టడం తెలుస్తోంది. తాజాగా ఓ కంపాసినేట్ అపాయింట్ మెంట్, స్పౌస్ నిర్ధారణ అంశాల్లో ఉద్యోగుల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు రావడం, చిలికి చిలికి విభేదాలు గాలివానగా మారడంతో ఇటీవల డిప్యూటీ సూపరింటెండెంట్‌కు డిడిపై ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ సూపరింటెండెంట్ జోక్యం చేసుకుని ఇరువురిని మందలించి సర్దుబాటు చేసినట్లు సమాచారం. అనంతరం అంతటితో ఆగకుండా ఓ ఆఫీసు సూపరింటెండెంట్‌పై బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో సదరు సూపరింటెండెంట్ తనకు రక్షణ కల్పించాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించడం, ఎన్‌జిఒ సంఘాల నాయకులు మధ్యవర్తిత్వం నెరపుతుండడం చర్చనీ యాంశంగా మారింది. కొన్ని నెలల తరబడి ఉద్యోగుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుని పోలీస్ కేసుల వరకు పరిస్థితి వెళ్తుంటే జిజిహెచ్ సూపరింటెండెంట్ ఏమి చేస్తున్నారనే విమర్శలు జోరు వెల్లువెత్తుతోంది.

ఎఫ్ఎసి ఇవ్వలేదు..

జిజిహెచ్ సూపరింటెండెంట్ సెలవుపై వెళ్లిన మాట వాస్తవమే. కానీ తనకు ఎఫ్ఎసి బాధ్యతల్ని ఇవ్వలేదు. మంగళవారంతో సూప రింటెండెంట్ 10 రోజుల సెలవు పీడియడ్ ముగియనుంది. ఈనేపథ్యంలో మరో మూడు రోజులు విధులకు హాజరు కాలేనని సమాచా రం అందించారు.

- సురేశ్వరరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్, జిజిహెచ్, కడప.

కడపలో మొదటి సారిగా
ఎపిఎల్ సీజన్-3 క్రికెట్ మ్యాచ్‌లు

- ఈనెల 30 నుంచి జూలై 3వ తేదీ వరకు నిర్వహణ
- స్టార్ స్పోర్ట్స్-1, స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం
- మ్యాచ్‌లకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాం
- అందరికీ ఉచిత ప్రవేశం
- జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్



ఫ్లడ్‌లైట్ వెలుగులో క్రికెట్ స్టేడియం



మ్యాచ్‌లకు సిద్ధమైన ఎసిఎ స్టేడియం



రెడ్డి ప్రసాద్



భరత్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

కడపలో మొట్టమొదటిసారిగా ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఏర్పాటుచేసిన ఫెడ్‌లైట్స్ కాంతులలో ఈనెల 30 నుంచి జులై 3 వరకు నాలుగు రోజులపాటు ఎన్నడూ లేని విధంగా ఎపిఎల్ (ఆంధ్ర ప్రీమియం లీగ్) సీజన్-3 టి- 20 క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఎపిఎల్ సీజన్-3 క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ, ఏర్పాట్లపై ప్రజాశక్తితో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విషయాలను తెలిపారు. ఎపిఎల్ సీజన్-1, సీజన్-2 మ్యాచ్‌లు గతంలో వైజాగ్‌లో నిర్వహించారని చెప్పారు. ఇప్పుడు ఏపిఎల్ సీజన్-3 క్రికెట్ మ్యాచ్‌లను కడప, వైజాగ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎపిఎల్ సీజన్ -3 మ్యాచ్‌ల ప్రారంభ కార్యక్రమం ఈనెల 30న కడప లోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఉంటుందన్నారు. ప్రారంభ రోజు ఒక మ్యాచ్ ఉంటుందని వారు తెలిపారు. తరువాత జులై 1,2,3 తేదీలలో మూడు రోజుల పాటు ఒక్కో రోజు రెండు మ్యాచ్‌లు(డే అండ్ నైట్) ఫెడ్ లైట్స్ కాంతులలో ఉంటాయని పేర్కొన్నారు. మొత్తం 7 మ్యాచ్‌లు లీగ్ పద్ధతిలో జరుగుతాయని వారు తెలిపారు. తర్వాత మ్యాచ్‌లు వైజాగ్‌లో ఉంటాయన్నారు. మొత్తం 6 జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. కోస్టల్ రైడర్స్, రాయలసీమ కింగ్స్, ఉత్తరాంధ్ర లయన్స్, బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్, వైజాగ్ వారియర్స్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని వివరించారు. మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాన్ని స్టార్ స్పోర్ట్స్ -1, స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానళ్లలో వీక్షించవచ్చునన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను చేసినట్లు వారు తెలిపారు. కడప నగర, జిల్లా ప్రజలకు, క్రికెట్ అభిమానులకు అందరికీ ఉచిత ప్రవేశం కల్పించామన్నారు. మొట్ట మొదటిసారిగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఫెడ్ లైట్స్ కాంతులలో కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఏపిఎల్ సీజన్ - 3 మ్యాచ్లు నిర్వహించడం ఓ గొప్ప సువర్ణ అవకాశంగా భావిస్తున్నట్లు చెప్పారు. మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

అచ్చెన్నాయుడును కలిసిన జిల్లా నాయకులు





అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న లక్ష్మిరెడ్డి, వికాస్ హరికృష్ణ

ప్రజాశక్తి -కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో, దేశంలో ఏ పార్టీకి రానంత మెజార్టీ రావడం హర్షనీయమని ఆ పార్టీ కడప సీనియర్ నాయకులు ఆలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు ఓటు ద్వారా తిప్పి కొట్టారని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కూడా లెక్కచేయకుండా వారిని ఏదో విధంగా వైసిపి ప్రభుత్వం అరెస్టులతో భయపడి ఇచ్చినప్పటికీ ఎదురొడ్డి పోరాడి నాయకులుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జయరాం రెడ్డి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన వికాస్ హరికృష్ణ

కడప : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు టిడిపి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి కృష్ణ అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి కృషి చేసిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడును ఆదివారం విజయవాడలో తన సొంత పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా వికాస్ హరికృష్ణ కలిశారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

యువత విలియం కేరిని ఆదర్శంగా తీసుకోవాలి
- రెవరెండ్ డాక్టర్ బిషప్ శామ్యూల్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్


నేటి యువత విలియం కేరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ కె.సామ్యూల్ బాబు అన్నారు. ఆదివారం విలియం కేరి వర్ధంతిని పురస్కరించుకుని ఆర్‌కె నగర్ లోని షాలేము ప్రార్థనా మందిర లో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలియంకేరి 1761, ఆగస్టు 17న ఇంగ్లండ్ సమీపంలో ఉన్న ఓ కుగ్రామంలో జన్మించారని చెప్పారు. 1775లో భారత దేశానికి క్రైస్తవ మిషనరీగా వచ్చి కలకత్తా వెస్ట్ బెంగాల్‌లోని శ్రీరామంపురం గ్రామంలో విలియం కేరి తన ఆధ్యాత్మిక మిషనరీ జీవితాన్ని ఆరంభించారని చెప్పారు. 1834, జూన్ 9 తేదీన మరణించారని తెలిపారు. కేరి భారత దేశం లోని 45 భాషలను తర్జుమా చేసి బైబిలు గ్రంథాన్ని ముద్రించిన ఘనత ఉందన్నారు. కేరి వృక్ష శాస్త్ర వేత్తగానే గాక వ్యవసాయ రంగంలో కూడా ఘన నీయమైన పేరు ప్రతిష్టలు ఆర్జించారని పేర్కొన్నారు. దేశంలోని మూఢాచారాలను తొలగించే ప్రయత్నం చేయడమే కాకుండా సతీసహగమనం, శిశువు హత్యలు, సాంఘిక దురాచారాలను రూపు మాపిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు. ఆయన అనువాదకుడే కాకుండా భయమెరుగని పత్రికా సంపాదకునిగా ఉంటూ కుష్టు రోగుల వైద్యశాలలను స్థాపించాడని అన్నారు. ఇలాంటి మహనీయుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకుని ఆదిశగా పయనించాలని సూచించారు. కార్యక్రమం లో రెవ.కె.స్వర్జన్ రత్న కుమార్, రెవ. బిషప్ కె. దానం, కె.ఎస్.రాజకుమారి, ప్రణూష స్పందన హెప్సిబా, వజ్రమ్మ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేటి తరం స్ఫూర్తి పొందాలి

కడప అర్బన్ : ఉపాధ్యాయ ఉద్యమ పోరాటంలో ఆనాటి త్యాగధనుల నుంచి నేటి తరం స్ఫూర్తి పొందాలని ఎస్‌టియు రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు సురేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం వివిఆర్ ఎస్‌టియు భవన్ లో 78 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలలో ఎస్‌టియు జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, వీణా విజయరామరాజు, మొహిద్దీన్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు, సీనియర్ నాయకులు జయరామయ్య మాట్లాడుతూ 7 దశాబ్దాల ఉపాధ్యాయ ఉద్యమ కాలంలో వీణా విజయరామరాజు, వి.పి రాఘవాచారి, పెర్నా శ్రీరామ మూర్తి లాంటి నాయకులు ఉద్యమాల ద్వారా 5 సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణను, ట్రిపుల్ బెనిఫిట్ స్కీ మ్ ద్వారా పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్ సాధించేవారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ పొందే సౌకర్యాన్ని, అప్రెంటిస్ రద్దును, 010 హెడ్ కింద జీతాలను, కౌన్సిలింగ్ విధానంలో ఉపాధ్యాయ బదిలీలను ఇలాంటి అనేక సౌకర్యాలు సౌలభ్యాలు ప్రాతినిధ్యాలు ఉద్యమాల ద్వారానే ఆనాటి నాయకులు సాధించారని పేర్కొన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని నేటి నవతరం నాయకులు విద్యారంగం, ఉపాధ్యాయ క్షేత్రంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు హైదర్ ఆలీ,శంకరయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగారెడ్డి, పి.రషీద్ ఖాన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్, జిల్లా నాయకులు విశ్వనాథ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, రవి శంకర్ రెడ్డి, రెడ్డెన్న, సాదిక్, సునీల్, వెంకటసుబ్బయ్య, వీరేంద్ర, రాజేంద్ర, గాలి సుబ్బరాయుడు, నందగోపాల్‌రెడ్డి, ప్రదీప్, ఫకద్దీన్, శ్రీనువాసుల రెడ్డి పాల్గొన్నారు.

జెఇఇలో 'నారాయణ' విద్యార్థుల హవా

ప్రజాశక్తి - కడప అర్బన్



నిఖిత



మేఘనరెడ్డి

జెఇఇ-అడ్వాన్స్‌డ్ ఫలితాలలో కడప నారాయణ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులతో తమ హవా చాటారని డిజిఎం రామ మోహన్‌రెడ్డి, కోర్స్ డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ర్యాంక్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్.నిఖిల్-436, ఎం.హసిన-1,607, సి.హితేస్‌రెడ్డి- 2,469, బి.లక్ష్మిసాయి హసిని-2,798, సి.సాయివైష్ణవి-2,829, పి.బ్రింద-4,717, సి.నీరజ్ శబరీష్-5,551, వినయ్ రెడ్డి,-5,034, బి. జాగృతి-6,653 ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిజిఎం, కోర్స్ డీన్ మాట్లాడుతూ విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల కృషి, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ ఘన విజయం సాధించారని చెప్పారు. విద్యార్థులు మాట్లాడుతూ విజయానికి నారాయణ అకడమిక్ ప్రోగ్రాం, అధ్యాపకుల ప్రోత్సాహం వల్ల సాధించామని తెలిపారు. నారాయణ యాజమాన్యం, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళిమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్, ఎజిఎం చెన్నకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన హరిప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశ పార్టీ ఎంఎల్‌ఎలుగా గెలిచిన పుట్టా సుధాకర్ యాదవ్, వరదరాజులురెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, మాజీ కార్పొరేటర్ బండి బాబు కలిసి అభినందించారు. ఆదివారం మైదుకూరు, ప్రొద్దుటూరుకు వెళ్లి ఎంఎల్‌ఎలకు పూలబొకే అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు బలిజ సంఘం నాయకులు చంద్రశేఖర్, భరత్ పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని శిల్పారామం కళావేదికపై ఆదివారం విద్యార్థులు సినీ, శాస్త్రీయ, జానపద గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. ముద్ర డ్యాన్స్ అకాడమి విద్యార్థులు నృత్యాలు చేసి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమాలను ఎఒ మునిరాజు పర్యవేక్షించారు.

ఆత్మరక్షణ కోసం కరాటే

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని వైసిపి నాయకులు నజీర్ అహ్మద్, కార్పొరేటర్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో కరాటే బెల్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిలుపు నిచ్చారు. మాస్టర్ షేక్.జంషేర్, బిలాల్ పర్యవేక్షణలో శిక్షణ పూర్తి చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 40 మంది క్రీడాకారులకు బెల్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాల,బాలికలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అయూబ్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

టిడిపి విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి -గోపవరం

రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమి విజయ ఢంకా మోగించడంతో బద్వేలులో జిల్లా తెలుగు యువత కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులు జహంగీర్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిద్ధవటం రోడ్‌లోని మసీదు రూములలో కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, దాదన భూపాల్ రెడ్డి హుస్సేన్ పీరా హాజరయ్యారు. ఈ సందర్భంగా జహంగీర్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రజలు వైసిపి అరాచక పాలనకు అంతం పలికారన్నారు. విడిపోయిన నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకున్నారని పేర్కొన్నారు. 175 సీట్లకు గాను కూటమికి 164 సీట్లు సాధించి పెట్టారన్నారు. ప్రజల నమ్మకం మరో ఐదేళ్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని వారు తెలిపారు కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పాటూరు నరసింహారెడ్డి, బి.కోడూరు టిడిపి నాయకులు షేక్ ముస్తఫా, కొత్తపు మునిరెడ్డి, కె వి సుబ్బారెడ్డి, వడ్లపూడి నాగభూషణం, రమణయ్య, జెటి చారి. పుష్పరాజు. రాజ్ కుమార్. మహబూబ్ బాషా, గౌస్, ఎస్ఎంఆర్ కాజా పాల్గొన్నారు.



అఫ్జల్ ఖాన్‌తో బ్యూటీ ఫ్యామిలీ సెలూన్ సిబ్బంది

సెలూన్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని నెహ్రూ పార్క్ వద్ద యునిసెక్స్ బ్యూటీ ఫ్యామిలీ సెలూన్ దుకాణాన్ని ఆదివారం కడప నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు అఫ్జల్ ఖాన్, రాజా జ్యువెలర్స్ అధినేత రాజశేఖర్ రెడ్డి, ఉమేష్ జ్యువెలర్స్ అధినేత షేక్ అల్లాబకాష్, జిఎన్ఆర్ జ్యువెలర్స్ అధినేత గోవిందు నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ యూనిసెక్స్ ఫ్యామిలీ సెలూన్ అధినేత పి. ఖాజాఖాన్ ఇలాంటి షాపులు మరెన్నో ప్రారంభించాలని నగర ప్రజల మన్ననలను పొందాలని కోరారు. అలాగే సెల్యూన్ ప్రొప్రైటర్ మాట్లాడుతూ ఫెషియల్స్, బాడీమసాజ్, హేర్ కటింగ్, పెడిక్యూర్, కేరాటిక్, అన్ని రకాల బ్యూటిషిన్ చేయబడును అన్నారు. కార్యక్రమంలో సెలూన్ సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.



బెల్ట్స్ పొందిన విద్యార్థులతో అతిథులు, కోచ్‌లు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ మొహమ్మద్ షా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని చిలకల బావివీధి, కెసి కెనాల్ రోడ్డులో ఉన్న అల్ షిఫా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో పేదలకు ఉచిత వైద్య శిబిరాన్ని కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ అస్మా, డాక్టర్ ఫరీద్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. చైర్మన్ మొహమ్మద్‌షా మాట్లాడుతూ మురికివాడలో ఉన్న పేదలకు ఉచిత వైద్య శిబిరం ద్వారా సేవలందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో షా సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఏపీ స్టాండింగ్ కమిటీ సభ్యులు సుంకేసుల బాదుల్లా, నగర అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ బాష, రెడ్డయ్య పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిములను వెంటనే విడుదల చేయాలని, దేశ వ్యాప్తంగా ఒకే తర హాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బా రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎఐటియుసి కార్యాలయంలో ఎపి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు బి.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈనెల 12న ఆంధ్రప్రదేశ్ కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని చెప్పారు. 2013లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వివిధ పథకాలు అమలులో ఉన్నాయన్నారు. జగన్ అధికారంలోకి రాగానే నవరత్నాల పేరుతో అవన్నీ తొలగించేసి కార్మికులను మోసం చేశారన్నారు. ఇసుక పాలసీ అంటూ ఇసుక వ్యాపారం మొదలుపెట్టి ఇసుక కొరత సృష్టించారని పేర్కొన్నారు. సంక్షేమ బోర్డుపై కన్ను పడి బోర్డులోని నిధులను విడతల వారీగా రూ.1,600 కోట్లు తీసుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నవరత్నాలకు ఆ నిధులను వాడుకున్నారన్నారు. ఇప్పటి వరకు 40వేల వరకు క్లెయిములు పెండింగులో ఉన్నా ఇంత వరకు ఏ ఒక్కరికీ నయాపైసా చెల్లించలేదని వాపోయారు. సమావేశంలో ఎపి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా ఆఫీస్ బేరర్స్ నాగేశ్వరరావు, రామాంజనేయులు, సిద్దయ్య పాల్గొన్నారు.

అక్రమాలపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

కడప అర్బన్ : యోగివేమన,ఆర్కి టెక్చర్ విశ్వవిద్యాలయాల్లో ఐదేళ్లల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటిపై విచారించి చర్యలు తీసుకోవాలని పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న డిమాండ్ చేస్తున్నారు. నగరంలోని పిడిఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్కి టెక్చర్ రిజిస్ట్రార్‌గా ఉన్నా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బామ్మర్ది ఇసి సురేంద్రనాదరెడ్డి అక్రమంగా కాంట్రాక్టు ఉద్యోగాలను రూ.4 నుంచి రూ.5 లక్షలతో 80కి పైగా ఉద్యోగాలను అమ్ముకుని బంధువులకు, తన వాళ్లలకు కట్టబెట్టాలని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా,రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా, నియామకాలు చేపట్టారని తెలిపారు. రాజకీయ పలుకుబడితో ఆర్కి టెక్చర్ యూనివర్సిటీ దోపిడీని చేశారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను అక్రమంగా వాడుకున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా శ్రీనాథ్ యాదవ్, పిడిఎస్‌యు నగర నాయకులు మనోజ్, వైష్ణవ్, రాహుల్, ఖాదర్ పాల్గొన్నారు.


విరాళాలు ఇచ్చిన శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

నిత్యాన్నదానానికి రూ.3 లక్షలు విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి వీరాంజనేయ స్వామి క్షేత్రానికి విచ్చేయు భక్తులకు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి బెంగళూరు వాస్తవ్యులు నాయని శ్రీనాథరెడ్డి, సతీమణి హరితరెడ్డి, కుమారులు హర్షిత్‌రెడ్డి, కృతిక్‌రెడ్డి రూ.3,00,116 విరాళం అందజేశారు. బెంగళూరు నుండి చక్రాయపేట ఏపీజీబీ దేవస్థానం ఖాతాకు జమ చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి తెలిపారు. గండి నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆకర్షితులై శనివారం రూ.3 లక్షల విరాళం ఇచ్చిన సురేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి మిత్రులిరువురు విరాళం పంపడం విశేషం. విరాళాలు అందించే భక్తులకు గండి క్షేత్రం అధికారులు చక్రాయపేట ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో 910 634 38 863 ఖాతా నెంబర్‌కు జమ చేయగలరని ఎసి కోరారు. ఐఎఫ్‌సి కోడ్ ఏపీజీబీ0002074 అని తెలిపారు. ఖాతాకు విరాళం జమ చేసిన తర్వాత 94404 29449 నెంబర్‌కు ఫోన్ చేసి వారి వివరాలు తెలియజేయాలని కోరారు. రాష్ట్రంలో తిరుమల వెంకటేశ్వర స్వామి వద్ద నిత్యాన్నదానం ఎలా కొనసాగుతున్నదో అలా గండి క్షేత్రంలో కూడా కొనసాగించడానికి సహకరించిన తాతలకు పేరుపేరునా ఆయన కృతజ్ఞతాభినందనలు తెలిపారు.


ఎమ్మెల్యే వరదను సన్మానిస్తున్న ఆటో కార్మికులు

'వరద' ప్రజామన్ననలు పొందాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి ప్రజామన్ననలు పొందాలని ఆటో కార్మికులు కోరారు. ప్రొద్దుటూరు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ సంఘ (టియన్‌టియుసి) నాయకులు ఆదివారం ఆరవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వరదరాజులరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకొని వరద పాలించాలన్నారు. సమాజం నుండి పేదరికం రూపుమాపే విధంగా యత్నించాలన్నారు. ప్రొద్దుటూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యాధిక నిరుద్యోగులు అనేక మంది ఉన్నారని, వారికి ఉపాధి కల్పించేలా కృషి చేయాలన్నారు. చాలా మంది విద్యాధికులు వేరే ఉపాధి దొరక్క ఆటో రంగాన్ని ఎంచుకున్నారని, వారి సంక్షేమానికి పాటుపడాలని కోరారు. ఇందుకు స్పందించిన వరద మాట్లాడుతూ ఆటో కార్మికులు ఈ విధంగా తనను కలవడం సంతోషంగా ఉందన్నారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రహిమాన్ పాల్గొన్నారు.


రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

రామోజీరావుకు టిడిపి నాయకుల ఘన నివాళి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి గ్రామం నాగుల గట్టుపల్లెలో ఆదివారం ఈనాడు సంస్థ చైర్మన్ రామోజీరావు చిత్రపటం వద్ద టిడిపి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈనాడు పత్రికతో పాటు, ఈటీవీ ఛానల్, ఫిలిం సిటీ మరి ఎన్నో సంస్థలు ఏర్పాటు చేసి వేలాది మందికి జీవనోపాధి కల్పించిన రామోజీరావు మృతి బాధాకరమన్నారు.


సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్ర పటం వద్ద టిడిపి నాయకులు ఆదివారం ఘన నివాళి అర్పించారు. గురిజాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లోమడ మురళి మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రమణ, ఖుషి, శివ, నాగేష్, విజయ్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** అక్షరయోధుడు, జర్నలిజానికి కొత్త సొబగులు దిద్దిన రామోజీరావ్ కారణ జన్ముడని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ముందుగా రామోజీరావ్ చిత్రపటానికి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి పూలమాల వేశారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులరెడ్డి, రాయలసీమ వ్యాయామ శిక్షణ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కూరపాటి శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ కోశాధికారి భోగా గంగాధర్, ఉపాధ్యక్షులు సాయికుమార్, బత్తల వెంకటప్రసాద్, ఉపాధ్యాయులు జింకా శేఖర్, అధ్యాపకులు నాగేంద్రరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, భాగవతార్ యడవల్లి రమణయ్య పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో రీజినల్ కన్వీనర్ నరసింహ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 1947, జూన్ 9న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆవిర్భవించిందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ ఎన్నో సమస్యల పరిష్కారాలకు ఉపాధ్యాయుల ప్రయోజనాలను ప్రభుత్వ విద్యను పరిరక్షిస్తూ తొలి పిఆర్‌సి సాధన నుంచి అంకుటిత దీక్షతో అప్రెంటిషిప్ విధానం పక్కనబెట్టి చాకిరీ నుండి విముక్తి కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుల్లంపేట, రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ఎస్‌టియు ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ టివి. రెడ్డి స్మారక ఎస్‌టియు భవన్‌లోఅధ్యక్షులు చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్‌టియు నేతలు సమావేశమై సంఘ పతాక ఆవిష్కరణ చేపట్టారు.

అనుమతుల్లేకుండా విగ్రహాల తయారీ

ఇతర జిల్లాలకు వినాయక విగ్రహాలు ఎగుమతి - రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి - పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఏడాదిలో వినాయక చవితి పెద్ద పండుగల్లో ఒకటి. ఈ పండుగ చిన్నపెద్ద అనే తారతమ్యంలేకుండా ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి రోజుల తరబడి ఉత్సవాలు నిర్వహిస్తూంటారు. ఈ నేపథ్యంలో వినాయక విగ్రహాల తయారీకి ఎర్రగుంట్ల కేంద్ర బిందువుగా మారింది. ఎర్రగుంట్లలో తయారు చేసే విగ్రహాలు పలు జిల్లాలకు సరఫరా అవుతున్నాయి. విగ్రహాల తయారీకి అనేక రకాల ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. మొదటగా విగ్రహాల తయారీ కేంద్ర నిర్వాహకులు జీఎస్టీ ఫర్మ్ ద్వారా జిల్లా చిన్న తరహా పరిశ్రమల అనుమతులు పొందాల్సి ఉంటుంది. విగ్రహాల తయారీ, అమ్మకాలకు సంబంధించి మ్యాను ఫ్యాక్చరింగ్ ఛార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు నగర పంచాయతీకి అందుతాయి. ముఖ్యంగా వ్యాపార లావాదేవీలకు సంబంధించి సదరు విగ్రహాల తయారీదారుడు వాణిజ్య ఆదాయ పన్నుతోపాటు ముఖ్యంగా జీఎస్టీ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా ఆయా శాఖలకు పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే ఇవన్నీ ఏమీ లేకుండానే సదరు వ్యక్తి ప్రతి ఏటా వందల సంఖ్యలో విగ్రహాలను తయారుచేసి విక్రయిస్తున్నా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రూ.కోట్లలో జరిగే ఈ వ్యాపారం ద్వారా ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఒక్కో విగ్రహం రూ.పదివేల నుండి దాదాపు రూ.లక్ష వరకు అమ్ముతుండడం విశేషం. విగ్రహాల అమ్మకాల సమయంలో సదరు వ్యక్తి కొనుగోలుదారులకు ఎలాంటి బిల్లులు ఇవ్వకపోవడంతోపాటు నగదు చెల్లింపునకు సంబంధించి రసీదు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

పుష్కలంగా రాజకీయ అండదండలు..

స్థానికంగా విగ్రహాల తయారీ అమ్మకాల్లో దిట్టగా పేరుగాంచిన సదరు వ్యక్తికి గత ప్రభుత్వంలో నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో నిబంధనలకు విరుద్ధంగా విగ్రహాల తయారీ, అమ్మకాలు చేస్తున్నప్పటికీ స్థానిక పురపాలక అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నేతల అండదండలు ఉన్నందున ఒక తాజా మాజీ ప్రజాప్రతినిధికి ఒక విగ్రహం, స్థానిక ప్రజా


ఎర్రగుంట్ల కేంద్రంగా విగ్రహాల తయారీ

ప్రతినిధికి ఒక విగ్రహం, ఒకచోటా నాయకునికి ఒక విగ్రహం ఉచితంగా ఇస్తున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి విగ్రహాల అమ్మకాల సమయంలో మాత్రమే నగర పంచాయతీకి కేవలం రూ.30 వేలు మాత్రమే చెల్లిస్తుండడం గమనార్హం. ఈ కారణంగా ప్రతి ఏడు దాదాపు రూ.2 లక్షల ఆదాయం నగర పంచాయతీ కోల్పోతోంది. అలాగే విగ్రహాల అమ్మకాల సమయంలో కొనుగోలుదారులకు ఎలాంటి బిల్లులు, రసీదులు ఇవ్వకపోవడం ద్వారా ప్రభుత్వం లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే విగ్రహాల తయారీ కొనసాగుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం ఏ మేరకు సబబో సంబంధిత ఉన్నతాధికారులు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. రాబడికి సంబంధించి అన్ని రకాల వనరులను ఒడిసి పట్టుకోవాల్సిన అధికారులు తమ కళ్ళముందే కోట్లలో వ్యాపారాలు చేస్తూ ప్రతి ఏటా లక్షలు సంపాదిస్తున్న వారి పట్ల ఉదాసీనత చూపడం ద్వారా పురపాలిక రాబడికి భారీ గండి పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న విగ్రహాల తయారీ కేంద్రాన్ని సీజ్ చేసి, అనుమతులు పొందిన పిదప విగ్రహాల తయారీ, విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులను కోరుతున్నారు.

'కృష్ణా బోర్డు'ను కర్నూలులో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె


ఎన్.తులసిరెడ్డి

కృష్ణా బోర్డు కార్యాలయాన్ని రాష్ట్రానికి తెప్పించి కర్నూలులో ఏర్పాటు చేయాలని కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం, సెక్షన్ 85 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజుల్లోపు కృష్ణానది యాజమాన్యపు బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలన్నారు. పదేళ్లయినా ఇప్పటి వరకు కృష్ణానది యాజమాన్యం బోర్డు ఆంధ్రప్రదేశ్‌కు తరలించకుండా హైదరాబాద్‌లోనే ఉంచారన్నారు. కృష్ణానది మీద నిర్మితమైన అన్ని సాగునీటి ప్రాజెక్టుల పరిపాలన నిర్వహణ ఈ బోర్డు పరిధిలోనే అన్నారు. ఇలాంటి అతి ముఖ్యమైన బోర్డు కార్యాలయాన్ని ఎపికి తరలించకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి టిడిపి, వైసిపి ప్రభుత్వాల అసమర్థతకు ఇది మచ్చు తునక అన్నారు. ఈ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని చంద్రబాబు, విశాఖలో ఏర్పాటు చేయాలని జగన్ లేఖలు రాయడం శోచనీయమన్నారు. తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలుగోడు, పోతిరెడ్డిపాడుతోపాటు పలు సాగునీటి రంగాలకు చెందిన ప్రాజెక్టులు కృష్ణా నది మీద ఉన్న ప్రాజెక్టులు అన్ని శ్రీశైలం రిజర్వాయర్‌కు ఆధారంగా నిర్మితమై ఉన్నాయన్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు సమీపంలోని కర్నూలు జిల్లాలో కానీ, నంద్యాల జిల్లాలో కానీ బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. కృష్ణా నది బోర్డు కార్యాలయాన్ని వెంటనే రాష్ట్రానికి తీసుకరావాలని ఆయన కోరారు.

అభివృద్ధిలో అందరి సలహాలు తీసుకుంటా : 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

ప్రొద్దుటూరు అభివృద్ధి విషయంలో అందరి సలహాలు, సూచనలు తీసుకుంటానని ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిందని, రాష్ట్రంలో ఎట్టకేలకు ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా కూటమి అత్యధిక సీట్లు గెలిచిందన్నారు. వైసిపి తన కేడర్‌ను నెలబెట్టుకోవడానికి కూడా కష్టంగా తయారైందన్నారు. ఇంత దుర్భర ఓటమి ఎన్నడూ ఏ పార్టీ చవిచూడలేదన్నారు. సజావుగా నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకొని వెళతామన్నారు. 12న సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఆయన వెంటనే రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ, ప్రజా సంక్షేమ పాలన అందిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ప్రొద్దుటూరులో అవినీతి, అన్యాయం జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చంద్రబాబు ప్రొద్దుటూరులో చేసిన హామీలు నెరవేర్చి తీరతామన్నారు. ఉదయం 6 నుండి రాత్రి 10 వరకు తాను అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఎక్కడ కూడా కక్ష సాధింపు చర్యలకు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

అవకాశం ఇవ్వవద్దని చంద్రబాబు చెప్పారన్నారు. ప్రొద్దుటూరులో అందరు ఊహించిన దానికంటే ఎక్కువ ఆధిక్యం ప్రజలు తనకు ఇచ్చారని, వారికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వద్ది బాలుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'ను కలిసిన టిడిపి నాయకులు


ఎమ్మెల్యే పుట్టాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మైదుకూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అఖండ మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఖాజీపేట మండల టిడిపి నాయకులు పలువురు పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలతోపాటు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరులో తన నివాసంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు బొగ్గుల చంద్రఓబుల్‌రెడ్డి, త్రిపురవరం గ్రామ నాయకులు హరినాథ్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిటాల వీరయ్యతోపాటు పలువురు నాయకులు పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'పుట్టా'ను సన్మానించిన మల్లెపల్లి సర్పంచ్ లక్ష్మీదేవి

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను మల్లేపల్లి సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి, ఆమె భర్త మల్లెపల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకుడు చిలమల నారాయణ ఆదివారం సన్మానించారు. ప్రొద్దుటూరులోని సుధాకర్ యాదవ్ నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మైదుకూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుదని నారాయణ అన్నారు. భవిష్యత్‌లో మఠం అభివృద్ధి కోసం మండల నాయకులు కృషి చేస్తారన్నారు.


సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి, నారాయణ



ఆశాజనకంగా కంది పంట

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ ఏడాది సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉంది. దీర్ఘకాలిక పంటగా రైతులు కంది పంట వేస్తారు. దిగుబడి ఇల్లు చేరాలంటే సుమారు మూడు నెలల వ్యవధి పడుతుందని రైతులు చెబుతున్నారు. కంది సాగు ఎక్కువగా మిశ్రమ పంటగా రైతులు సాగు చేస్తారు. వేరుశనగ, జొన్న, కొర్ర తదితర పంటల్లో మిశ్రమ పంటగా కంది సాగు చేయడం రైతులకు అలవాటు. మిశ్రమ పంట కనుక పెట్టుబడి కూడా పెద్ద సమస్య ఉండదు. బాగా కాపు వస్తే ఎకరాకు రెండు లేదా మూడు క్వింటాళ్ల కందులు తయారవుతాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది సాగుకు ప్రకృతి బాగా అనుకూలించినట్లు రైతులు చెబుతున్నారు. మంచి వర్షాలు రావడం వల్ల ప్రస్తుతం కంది పంట బలంగా ఉంది. ఎన్నో ఆశలు నింపుకున్న కంది రైతులకు ప్రకృతి అన్ని విధాల సహకరించాలని ఆశిద్దాం.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- పీలేరు

పీలేరులో జరిగిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక ఎస్‌కెఆర్ హాస్పిటల్స్‌లో జరిగిన ఈ వైద్య శిబిరంలో 68 మందికి మదనపల్లికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్‌ఆర్ బాషా ఆధ్వర్యంలో రోగులకు గుండె జబ్బు ప్రాథమిక నిర్ధారణా పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి బిపి, షుగర్, లిపిడ్ ప్రొఫైల్, బ్లడ్ కౌంట్స్, 2డి ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా రోగులకు చికిత్స, మందులు అందించారు. ఎస్.కె.ఆర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కెఎం.బాషా, వైద్యులు డాక్టర్ ఎస్‌కెఎం వసీం, డాక్టర్ అస్ఫియా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కుందూ నదిలో పెరిగిన నీటిమట్టం

ప్రజాశక్తి - చాపాడు

గత రెండు రోజులుగా కుందూ నదిలో నీటిమట్టం పెరిగింది. పది రోజుల క్రితం వరకు కుందూలో చుక్క నీరు లేదు. వారం రోజులుగా ఎగువ ప్రాంతంలో పడిన వర్షానికి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం కుందూ నదిలో రాజోలి ఆనకట్ట నుంచి 7వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శుక్రవారం రాత్రి కుందూనదికి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం నదిలో 7వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోంది. కుందూనది తీర గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. కుందూ నది నీటి ఆధారంగా ఇప్పటికే రైతులు పసుపు పంట సాగు చేపడుతున్నారు. వరి ఇతర పంటలు సాగు చేసే రైతులు సిద్ధమవుతున్నారు.

అభివృద్ధికే పట్టం కట్టారు

టిడిపి యువనేత బొల్లపు ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని టిడిపి యువనేత బొల్లపు ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆదినారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు ఎన్నుకోవడం శుభపరిణామమన్నారు. 2004 నుంచి 2019 వరకు ఆదినారాయణ రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్ల రెండింటిని నగర పంచాయతీలుగా మార్చడంలో ఆయన పాత్ర కీలకమైందన్నారు. ప్రతి గ్రామాన్ని కలుపుతూ ఆ రోజుల్లో గ్రావెల్, తారు రోడ్లు వేయించారన్నారు. ప్రతి ఇంటికి దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం, ఎన్నో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని ఆది నారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

'మండిపల్లి'కి సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని చిత్తూర్ రోడ్ లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధిలో నడిపిస్తానని అన్నారు వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిసి రైతులు పంటలు బాగా పండించుకుని అధిక లాభాలు వచ్చేలా ఉండాలని అమ్మవారికి పూజలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివారెడ్డి, అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కిషోర్‌చౌదరి, మండిపల్లి అభిమానులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వేసవి ముగింపు కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. సిరి సంజీవని, ది మిల్లెట్స్ కేఫ్ వారి సౌజన్యంతో మాస్టర్ యువకిషోర్, యువరాజ డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారు సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన చిన్నారుల ఆటపాటలతో ప్రాంగణమంతా సందడి నెలకొంది. ప్రేక్షకులు చిన్నారులను తమ కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ యువకిషోర్, ప్రకాష్ (సిరి సంజీవని), స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

